సైదాబాద్ ఉజాలా షా-ఈద్గామైదానంలో నమాజ్‌కు హాజరైన ముస్లింలు



సైదాబాద్ ఉజాలా షా-ఈద్గా మైదానంలో నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాలవద్ద ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన పోలీసులు,నాయకులు

ఎల్బీనగర్, జూన్ 17: ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా బక్రీద్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సరూర్‌నగర్ ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం మైనార్టీ సోదరులకు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల ప్రముఖులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డిలతో పాటు సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి, నాయకులు బేరబాలకిషన్, బొయిని శంకర్ యాదవ్, నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, కందికంటి శ్రీధర్ గౌడ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు సాజిద్, మహ్మద్ జహీర్, కరీం, ఆసీఫ్, షౌకత్, సలీం తదితరులు శుభాకాంక్షలు తెలిపిన పోలీసు అధికారులను, నాయకులను సన్మానించారు.

జల్‌పల్లిలో మున్సిపాలిటీ పరిధిలో..

ఆర్కేపురం : జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట్, పహాడీషరీఫ్, శాహీన్‌నగర్, బడంగ్‌పేట్ మున్సిపాలిటీ, తక్కగూడ మున్సిపాలిటీ, సరూర్‌నగర్ డివిజన్‌లోని ఈద్గాలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సరూర్‌నగర్‌లోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాలో నిర్వహించిన బక్రీద్ వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బేర బాలకిషన్, సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

మలక్‌పేటలో...

సైదాబాద్ : బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థన (నమాజ్)లు చేసి ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని సైదాబాద్, అక్బర్‌బాగ్, అజంపురా, పాతమలక్‌పేట, మూసారాంబాగ్, ఐఎస్ సదన్, కుర్మగూడ డివిజన్ల పరిధిలోని ఉజ్జాలా-షా ఈద్గా, ఖుబ్బ మసీదు, ఖాద్రియా, జమా మసీదు, ఖాజాబాగ్, సలీంనగర్ ఈద్గా, మాదన్నపేట ఈద్గా, మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. సైదాబాద్ ఉజ్జాలా -షా ఈద్గాలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ మినాజుద్దీన్ పాల్గొని ప్రార్థనలు చేశారు.

సైదాబాద్ ఉజ్జాలా షా- ఈద్గా మైదానంలో జరిగిన నమాజ్‌ను పురస్కరించుకుని సైదాబాద్ డివిజన్ ఏసీపీ వెంకన్ననాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి ధరావత్ తన కార్యాలయంలో బందోబస్తు చర్యలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు.

వ్యర్థాల తొలగింపులో సిబ్బంది...

బక్రీద్ పండుగ సందర్భంగా మేకల, గొర్రెల, పొట్టేళ్ల జీవాల వ్యర్థాల తొలగింపు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసుల సమన్వయంతో వేగంగా కొనసాగించారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో పారిశుధ్య కార్మికులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని వ్యర్థాల మూలంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూశారు. డస్ట్‌బిన్ల వద్ద పడవేసిన గడ్డి, చెత్తాచెదారం, జంతువుల చర్మాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు వెంటవెంటనే తొలగించారు.

కందుకూర్‌లో.....

కందుకూరు: బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కందుకూరుతో పాటు దాసరపల్లి, నేదునూరు, ముచ్చర్ల, కొత్తగూడ, గపూర్‌నగర్, అగర్‌మియాగూడ, బైరాగిగూడ, గూడూరు, మహమ్మద్‌నగర్, దెబ్బడగూడ, మహమ్మద్‌నగర్, సరస్వతిగూడ, పులిమామిడి, తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ ఎండీ అప్జల్‌బేగ్, ఎండీ ఖదీర్, అంజద్, చోటెజానీ, అజు, అజీజ్, దాసర్లపల్లి మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాండ్ర దేవేందర్ శుభాకాంక్షలు తెలిపారు.

సరూర్‌నగర్ ఈద్గాలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏసీపీ కృష్ణయ్య, నవీన్‌రెడ్డి, బేర బాలకిషన్, ధన్‌రాజ్‌గౌడ్

బక్రీద్ శుభాకాంక్షలు తెల్పిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఎల్బీనగర్, జూన్ 17 : బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.

సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జానీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాలనీవాసులు వెంకటాద్రి, గంగదాసు కృష్ణారెడ్డి, నర్సింహాగౌడ్, పవన్‌కుమార్, శీనయ్య, డాక్టర్ వెంకటేశ్వరరావు, రవిచంద్ర, ఏవీ రావు తదితరులు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాండ్ర దేవేందర్

కందుకూరు, కొత్తగూడ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు ఖదీర్, అంజద్, తదితరులు

జన్మనిచ్చిన దవాఖానలోనే పుట్టిన రోజు వేడుకలు

మన్సూరాబాద్, జూన్ 17: నెలలు నిండకముందే పుట్టిన బిడ్డను కాపాడి ప్రాణం పోసిన ఆరేంజ్ ఆస్పత్రిలోనే తమ చిన్నారి జన్మదిన వేడుకలను జరుపుకునేందుకు కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం, సత్తుపల్లికి చెందిన జక్కంపూడి ఉదయ్‌కిరణ్, కవిత దంపతులు. వివాహమైన ఏడు సంవత్సరాలకు చిన్నారి జన్మించింది. వైద్యులు, సిబ్బందితో సంతోషాన్ని పంచుకోవడానికి ఉదయ్‌కిరణ్, కవిత దంపతులు తమ చిన్నారి మొదటి పుట్టిన రోజును ఎల్బీనగర్‌లోని ఆరేంజ్ ఆస్పత్రిలో జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. సోమవారం జరిపిన చిన్నారి ధన్విక మొదటి పుట్టిన రోజు వేడుకలకు మిస్ ఇండియా సుధాజైన్ హాజరయ్యారు. చిన్నారికి ఎలాంటి అపాయం కలుగకుండా కాపాడిన డాక్టర్ గౌతమ్ గోరిటియాను సుధాజైన్ అభినందించారు. ఆస్పత్రి బిజినెస్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు గోయల్ డ్రైవర్లను పర్మినెంట్ చేయాలి

శంషాబాద్ రూరల్, జూన్ 17: ఎయిర్‌పోర్టులో గోయల్ సంస్థలో పని చేసే డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2008 నుంచి గోయల్ సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లను 8 ఏండ్లలో పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఉద్యోగంలోకి తీసుకున్నారని తెలిపారు. సంస్థ 16 ఏండ్లు దాటినా ఇప్పటికీ పర్మినెంట్ చే యాలని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం డ్రైవర్లను పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయిర్‌పోర్టులో డ్రైవర్లుగా పనిచేస్తున్న తాము సంస్థ ప్రతినిధులను వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లితే సెక్యూరిటీ ప్రతినిధి వినతిపత్రం తీసుకున్నట్లు తెలిపారు. తమకు న్యాయం చేసే వరకు ఊరుకునేదిలేదని హెచ్చరించారు. త్వరలో కార్యచరణ ప్రకటించి, గోయల్ సంస్థ తమను పర్మినెంట్ చేసే వరకు ఉద్యమిస్తామని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడు, కొత్తపేట డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు కాట అశోక్ గౌడ్ మరణించడంతో ఆయన భౌతిక కాయానికి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్, బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ నివాళులర్పించారు.

– ఎల్బీనగర్, జూన్ 17

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, జూన్ 17 : ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీలోని అలివేలు మంగ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపుర డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, కాలనీ వాసులు వెంకట్ రెడ్డి, సుధాకర్‌గుప్త, నర్సింహారెడ్డి, మూర్తి, నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, సిద్ధగోని వెంకటేశ్‌గౌడ్, శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, మహేందర్‌రెడ్డి, శ్యామ్‌గుప్త, పబ్బు శ్రీనివాస్, రమేశ్‌కురుమ, మహిళ అధ్యక్షురాలు లిక్కి ఊర్మిలారెడ్డి, స్వప్న తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రామంతాపూర్, జూన్ 17: మహిళలు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి అన్నారు. సోమవారం రామంతాపూర్ డివిజన్‌లో అంబేద్కర్ హాల్‌లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జంగయ్య, బి.ఆనంద్, శ్రీనివాస్, నిరంజన్‌గౌడ్, శ్రీనివాస్, అంజయ్య, మల్లికార్జున్, ట్రైనింగ్ టీచర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఉప్పల్, జూన్ 17: అభివృద్ధి, సంక్షేమానికి తనవంతు తోడ్పాటు అందిస్తున్నామని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం కార్పొరేటర్ పరిశీలించారు.

యోగశాలకు స్థలం కేటాయించాలి

ఉప్పల్, జూన్ 17 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తపస్య ఫౌండేషన్ ఉప్పల్ ఆచార్య వేదసింధు, బొల్లా విజయ్‌కుమార్‌తో కలిసి సోమవా రం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిశారు. ఈ మేరకు గోశాల, యోగశాలకు ప్రభుత్వ స్థలం కేటాయించేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం కేటాయింపు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, తనవంతు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ జైస్వాల్, పత్తిపాక లక్ష్మణ్, గంగాధర్ మహాజన్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

రామంతాపూర్, జూన్ 17: రామంతాపూర్ భగాయత్ కాలనీలో ప్రజలకు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు తదితర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం రామంతాపూర్ డివిజన్‌లోని సత్యనగర్, లక్ష్మీకాంత్‌నగర్, శ్రీనగర్ తదితర కాలనీల్లో ఆయన పర్యటించారు. అనంతరం ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు తాగునీరు,డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, శంకర్, సూరం శంకర్, మహేందర్ ,సంధ్య, లక్ష్మి, సాగర్, ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్ ,విజయలక్ష్మి, మధు, ప్రవీణ్, సంతోష్, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలు కాలనీలకు బస్సు సేవలు ప్రారంభం

మన్సూరాబాద్, జూన్ 17: పలు కాలనీలకు మూడు సంవత్సరాల క్రితం నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సేవలను సోమవారం తిరిగి ప్రారంభించారు. బస్సు సౌకర్యం లేక పోవడంతో మన్సూరాబాద్ ప్రెస్‌కాలనీ, సౌత్ ఎండ్ పార్కు కాలనీ, సెవన్‌హిల్స్‌కాలనీ, డీపీ నగర్, చండీశ్వర్ కాలనీకి చెందిన ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు ఈ విషయాన్ని బండ్లగూడ ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లపై ఇష్టానుసారంగా చేస్తున్న పార్కింగ్‌లు కూరగాయల సంతల వలన బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కాలనీవాసులకు డిపో మేనేజర్ వివరించారు. డిపో మేనేజర్ సూచనల మేరకు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు విషయాన్ని కార్పొరేటర్, జీహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇష్టానుసారంగా రోడ్లపైన పార్కింగ్‌లు, కూరగాయల మార్కెట్లను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇవ్వడంతో ఆర్టీసీ బస్సు పునరుద్ధరణకు డిపో మేనేజర్ చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం సౌత్‌ఎండ్ పార్కు కాలనీ నుంచి బస్సులు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు ఉదయం 7:30 గంటలకు కోటి మీదుగా సికింద్రాబాద్, సెక్రటేరియట్‌కు రెండు బస్సులను నడపనున్నారు. బస్సులను పునఃప్రారంభించిన ఆర్టీసీ యాజమాన్యానికి కాలనీలవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు

బండ్లగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

మన్సూరాబాద్, జూన్ 17: వర్షా కాలంలో వరదనీటి ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి బండ్లగూడలో రూ. 1.20 కోట్లతో చేపట్టనున్న వరదనీటి పైపులైన్ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదనీటి పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వర్షా కాలంలో లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీవాసులు రామ్మోహన్‌శర్మ, మాధవరెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

బ్లడ్ బ్యాంక్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, జూన్ 17 : డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో పటిష్టమైన ప్రణాళికతో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని బ్లడ్ బ్యాంక్ కాలనీలో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పలు వీధుల్లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ సదుపాయం లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని కాలనీవాసులు అనారోగ్యం బారినపడే ప్రమాదముందని అన్నారు. డివిజన్‌లోని శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందని, దశలవారీగా వాటిని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కాలనీవాసులు గాలయ్య, జంగారెడ్డి, మల్లేశ్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, యుగంధర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబాబు

నియామక పత్రం అందుకుంటున్న రాంబాబు నాయక్

ఆర్కేపురం, జూన్ 17 : సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా అంగోతు రాంబాబు నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న సేవాలాల్ సేన ముఖ్య నాయకుల సలహాలు, సూచనలను అనుసరించి తాజా పరిణామాలపై త్రిసభ్య కమిటీ సమావేశమై అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి సమన్వయంతో సంఘ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ సేన బలోపేతానికి శక్తిపంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై స్పందించి తగు న్యాయం చేసేందుకు పాటుపడుతానన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన త్రిసభ్య కమిటీ సభ్యులకు సహకరించిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు, శ్రేయోభిలాషులకు, సేవాలాల్‌సేన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.